సింగిల్ పేజీ కథ

# వాస్తవం

**నున్నటి తారు రోడ్డుమీద టాక్సీ జారిపోతున్నది. అప్పుడే కొండగాలి వీచి మనసును మురిపిస్తున్నది.**

వసుమతి టాక్సీలో నుంచి తల బయటకు పెట్టి దూరంగా చూసింది. ఏరాడ కొండకోనలు కనిపిస్తున్నాయి. ఇంకా కొంతదూరం పోతే ఆ కొండ పాదాలను తాకుతూ నిరాశతో వెనక్కు తిరిగిపోయే నీలి సముద్రం కూడా కనిపిస్తోంది. ఎందుకో ఆ సముద్రం అర్థం కాని వేదనతో అలమటించిపోతూ ఘోష పెడుతోంది.

వసుమతికెప్పుడూ ఆ కొండనూ, సముద్రాన్ని చూసినప్పుడు పెద్దనగారి మనుచరిత్ర గుర్తుకొస్తుంది.

ఆ కొండ ప్రవరాఖ్యుడైతే-వలచి వలపించుకోలేకపోయిన వరూధిని సముద్రం.

వసుమతి, ఆమె భర్త రంగారావులిద్దరూ కొన్నాళ్లు ఈ కొండ అంచున బ్రతికారు. చాలా సంవత్సరాల తరువాత మళ్లీ తిరిగి వస్తున్నారు. ఇక్కడ పారేసుకుని వెళ్లిన నిధి మళ్లీ దొరుకుతున్నట్టుగా వుంది వాళ్లకు.

ఇక్కడ వసుమతి క్రిందటిసారి చాలా అనుభూతులు వదిలి వెళ్లింది. ఇక్కడే ప్రకృతి అందించిన అందాలూ, ఆనందాలూ మళ్లీ వెతుక్కోవాలి.

వసుమతి టాక్సీ దిగి పూర్వం విడిచిపెట్టిన ఆ ఇంటిలో మళ్లీ కాలుపెట్టింది.

సూర్యకిరణాలు ఏరాడ కొండమీద నుంచి దూకుతూ కొబ్బరాకులతో దోబూచులాడుతున్నాయి.

మనుషులు మారినా ప్రకృతి మారదు. ఎప్పటిలాగే జామచెట్ల మీద చిలుకలు ప్రణయ కలహాలతో పొద్దుపుచ్చుకుంటున్నాయి.

దూరంగా సముద్రం కనిపిస్తున్నది. చుక్కల్లాగా చిన్న చిన్న పడవలు తేలిపోతున్నాయి. జాలర్ల పిల్లలు నగ్నంగా అలల్లో పడి ఈదులాడుతున్నారు.

వీటన్నిటిమధ్యా మరపురాని మధురస్మృతి ఒకటి వుంది. అప్పలనరిసీ, దాని మొగుడూ ఇద్దరూ ఆ కొండల్లో కొండల్లాగా, ఆ తరగల్లో తరగల్లాగా బతికారు.

నిజానికి ఆ జంటను చూసి నీలిసంద్రం ఎగిసిపడింది. అప్పలనరిసి అందాన్ని చూసి ప్రకృతి కూడా అందాలు దిద్దుకున్నది.

ఆ ఇంటికి రాగానే వసుమతి ముందుగా ఆ జంట కోసమే చూసింది.

ఒకనాటి మాట...

సింహాద్రి కొత్తగా పెళ్లి చేసుకుని భార్యను తెచ్చుకున్నాడు. వయసు తెచ్చిన వూపుతో, కాయకష్టం అందించిన ఆరోగ్యంతో, 'పిల్లపేరు మల్లెమొగ్గ-నాపేరు జమీందారు' అన్నట్టు వుండేవాడు.



అప్పలనరిసి నిజంగా మల్లెమొగ్గ. దాని కళ్లల్లో మెరుపులుండేవి. నవ్వినపుడల్లా తళుక్కున మెరిసే పలువరుస వుండేది. గాలికి ఎగిరిపోయే పైటను విసురుగా వెనక్కు తోసి నడుముకు దోపుకునే దాని అందం చూసి తీరాలి.

రంగన్నని పిలిచి ''రంగన్నా! ఎవర్రా ఆ పిల్ల? కొత్తగా పెళ్లయి వచ్చినట్టుంది'' అని అడిగింది వసుమతి.

రంగడు నవ్వి చెప్పాడు. ''ఆడు పచ్చరోడమ్మా. పేరు సిమాద్రి. ఈ నడవే దానికి తాళి కట్టినాడు. బొట్టి బాగుంటాదమ్మా. రోడ్డంట పరాసికాలూ ఈడూ-బొత్తిగా సిగ్గునేదో ఏటో.''

'ఆ పిల్ల పాకీపిల్లా? ఎంత చిత్రం? ఆ అందమేమిటి? అంత సంతోషం ఎందుకు? ఎన్నో సామ్రాజ్యాలు జయించినట్టు వాళ్ల మొహాలు కళకళలాడిపోతున్నాయి.'

వసుమతికి ఆంతర్యంలో ఈర్ష్యగా అనిపించింది.

వసుమతి రోజూ వాళ్లను చూస్తూనే వుండేది. వాడు ఏ కాయో, పువ్వో తెచ్చి దాని చేతిలో పెట్టేవాడు. అది బావిలో నీళ్లు చేది, బకెట్‌తో వాడి చేతుల్లో పోసేది. దోసిలి పట్టి వాడు ఆ నీళ్లు తాగేవాడు.

ఇంకా నాగరికతా ప్రభావం వాడిని అంటలేదు. కాలంతో పందెం పెట్టుకుని మానవుడు తీసే పరుగులు వాడికి అర్థం కావు.

ఈ నాగరికత మానవుడిని పెద్ద అగాథంలోకి తోస్తున్నది.

తోటివాడు తనకన్నా ముందు పైకి వెళ్లిపోతాడనే ఆత్రుత, పై ఆఫీసరు చేత చీవాట్లు తినవలసి వస్తుందనే భయం, ప్రమోషన్ల కోసం పడే తహతహలు అన్నీ 'జీవఫలం-చేదువిషం' అన్నట్టుగా మారుస్తాయి.

అలవాటుపడుతుంటే యాంత్రిక జీవితమే సిసలైన జీవితంలాగా కనిపిస్తుంది. అప్పుడు కోయిల పాట వ్యర్థాలాపన. ఆకాశంలో హరివిల్లులూ, తారకల అందాలూ, పసిడి రెక్కల విహంగాలూ అన్నీ వృథా. ఏదీ కనిపించదు. ఏమీ వినిపించదు.

అధికార వ్యామోహం మనిషిని వల వేసి తన ఒడిలోకి లాక్కుంటుంది. చివరకు వట్టి శూన్యమే మిగులుతుంది.

గతమంతా ఆలోచిస్తుంటే అప్పలనరిసిని చూడాలనిపించింది వసుమతికి. ఆ సాయంత్రం రంగడిని అడిగింది.

''అప్పలనరిసి ఇంకా గుర్తుందేటమ్మగారూ! సిమాద్రి వట్టి తాగుబోతు. అరడజనుమంది పిల్లలూ ఆడూనూ. ఆడికొచ్చేది తాగటానికే అయిపోతాది.''

కుటుంబ నియంత్రణో ఏదో అది వాళ్ల జీవితాలను స్పృశించలేదు. సారాకొట్లూ, చాలీచాలని జీతాలూ వాళ్ల బ్రతుకులో హాలాహలాన్ని నింపుతున్నాయి.

''రంగడూ! అప్పలనరిసిని ఒక్కసారి పిలువు. చూడాలని వుంది.''

''అమ్మగారు చూస్తారు రమ్మని చెప్పానమ్మా.

అది వూరికే సిగ్గుపడిపోనాది.''

ఆ సాయంత్రం వసుమతి పాప చేయి పుచ్చుకుని ఏరాడ కొండవైపు షికారు బయలుదేరింది. కొండమీద సూర్యుడు ఎర్రగా నిప్పుముద్దలా వున్నాడు. బారులు తీర్చి వున్న తాటిచెట్ల కిందకి నడుస్తున్నది వసుమతి.

ఎవరో ముసిలమ్మలాగా వుంది. తాటిచెట్ల కింద గిలకలు ఏరుకుంటున్నది. వసుమతిని చూడగానే లేచి నిలబడి నమస్కరించింది.

''రంగడు సెప్పినాడమ్మా రమ్మని. రేపు వద్దామనుకుంటున్న.''

''ఎవరీ మనిషి?'' ఆశ్చర్యంగా చూసింది వసుమతి.

''నేనమ్మా అప్పలనరిసిని. మీరు పోల్చుకోలేక పోనారమ్మా.''

ఎవరో వూహల శిఖరం మీదనుండి, వాస్తవమనే అగాథంలోకి విసిరివేసినట్టుగా వుంది వసుమతికి.

''అప్పలనరిసీ! ఏమిటిలా చిక్కిపోయావు? ఏమైనా జబ్బు చేసిందా?''

''ఏటవమ్మా పాడుబతుకూ, ఈ పిల్లలు సూడండమ్మా వూరికే పీక్కుతింటారు.''

అటువైపు కాస్త దూరంగా సింహాద్రి తాటిగిలకలూ, మట్టలూ కలిపి మోపు కట్టుకుని ఎత్తుకున్నాడు. వాడు ఎప్పటిలాగే మస్తుగా వూగుతూ, తూగుతూ నడిచిపోతున్నాడు.

''అమ్మా, పాత చీర వుంటే ఇయ్యండమ్మా. మూడునెలల గుంటడు. ఆడి పక్కకేటి నేదమ్మా.''

ఉలిక్కిపడి చూసింది వసుమతి.

'ఊర్వశి లాంటి అప్పలనరిసి అడుక్కోవటమా? ఓరి భగవంతుడా?'

హఠాత్తుగా-వసుమతికి అప్పలనరిసిని పట్టుకుని దూరంగా సముద్రంలోకి విసిరి పారేద్దామనిపించింది. అలాగయితే ఇంకెప్పుడూ అప్పలనరిసి తనకు కనిపించదు. అప్పలనరిసి తనవెంట పడుతుందేమో అని త్వరగా ముందుకు సాగిపోయింది.

**-బద్దిగం పాండురంగారెడ్డి (కరీంనగర్)**

# దుబారా

**ఆఫీసు నుంచి వచ్చి బాత్‌రూంలోకి వెళ్లి మొహం కడుక్కుని హాల్లోకి వచ్చిన భర్తకు ప్రేమగా పకోడీల ప్లేటును అందిస్తూ ''ఏమండీ! రేపు ఫస్ట్ తారీఖు కదా!'' అడిగింది భార్య.**

''ఔను! అయితే ఏం?''

''మరేం లేదు. పండుగ వస్తుంది కదా! నాకు ఓ రెండు వేలు ఇస్తే నేను పట్టుచీర కొనుక్కుంటానండి'' ఎంతో ఆనందంగా, గారంగా అడిగింది భార్య.

''కుదరదు'' వెంటనే చెప్పాడు భర్త.


ఎప్పుడు ఏమడిగినా తక్కున కాదనకుండా అంగీకారాన్ని తెలిపే భర్త ఇలా అనడంతో ''ఏం? ఎందుకు కుదరదు?'' ఆశ్చర్యంగా అడిగింది భార్య.

''ఇకనుంచి అలాంటివేం కుదరవు. ఇన్నాళ్లు ఏదీ తెలీనితనంతో గడచిపోయింది. ఇకనుండయినా జాగ్రత్త పడాలి'' చెప్పాడు భర్త.

''ఏంటండి! మీరేం చెబుతున్నారో నాకు అర్థం కావడం లేదు. అదేదో కాస్త అర్థమయ్యేలా చెప్పండి'' ఇంకా ఆశ్చర్యంగా అడిగింది భార్య.

''రాజీ! మన పిల్లలు పెద్దవారవుతున్నారు. వారి చదువులు, పెళ్లిళ్లు అంటే చాలా ఖర్చవుతుంది. కనుక ఇకనుంచి మనం దుబారాను, అనవసర ఖర్చులను తగ్గించుకొని, వచ్చే నా ఆదాయాన్ని చాలా జాగ్రత్తగా, పొదుపుగా వాడుకుంటూ అంతో ఇంతో మిగిలించాలి. దీనిని ఈ కొత్త సంవత్సరం నిర్ణయంగా తీసుకుందాం'' చెప్పాడు భర్త.

''అలాగేనండి. మీ ఆలోచన చాలా బాగుంది. అందుకు నేను పూర్తిగా సహకరిస్తాను. ఏం తగ్గించుకోవాలో, ఎలా మెలగాలో మీరే చెప్పండి'' సంతోషంగా అడిగింది భార్య.



''ఒకటి- నువ్వు ఇంట్లోనే వుంటావు కనుక పనిమనిషిని మానిపించాలి. రెండు- పక్కింటివాళ్లింట్లో పేపరు, పత్రికలు వుంటాయి కనుక వాటిని కొనడం మానేయాలి. మూడు- టీవీ వుంది కనుక సినిమాలకు వెళ్లడం బంద్ చేయాలి. నాలుగు- చీరలు, నగలు కొనకుండా షాపింగ్ మానేయాలి. ఐదు- అనారోగ్యాన్ని కలిగిస్తాయి కనుక చేపలు, మాంసాహారాన్ని మానేయాలి. ఆరు- వాయిదాల పద్ధతిలో వస్తువులను కొనడం మానేయాలి. ఏడు- పిల్లలని ట్యూషన్ మాన్పించి ఇంటి దగ్గర నువ్వే చెప్పాలి. ఎనిమిది- బంధువులు వచ్చినపుడు, పండుగలప్పుడు దుబారాను తగ్గించాలి. తొమ్మిది- నడక ఆరోగ్యానికి మంచిది కనుక షాపింగ్ పనులన్నీ ఆటో ఉపయోగించకుండా చూసుకోవాలి. పది- కరెంటు, ఫోన్‌లను పొదుపుగా వాడుకుంటూ ఖర్చులను తగ్గించాలి'' గడగడా చెప్పాడు భర్త.

''అలాగేనండీ! మీరు చెప్పినవన్నీ చాలా బాగున్నాయి. తూ.చా. తప్పకుండా పాటిస్తాను. కానీ మీరు కూడా...'' అంటూ చెప్పడానికి సందేహించింది భార్య.

''ఊ! మీరు కూడా ఏంటో చెప్పు. తప్పకుండా చేస్తాను'' నవ్వుతూ చెప్పాడు భర్త.

''ఏం లేదు. మీరు కూడా ఆర్థికంగా, ఆరోగ్య, శారీరక, మానసికపరంగా హానిని కలిగించే ఆ సిగరెట్లు, డ్రింక్ మానివేస్తే...'' అంటున్న భార్యను మధ్యలోనే అడ్డుకొని ''ఆహా! అది మాత్రం కుదరదు. ఆ ఒక్కటీ అడక్కు...'' అంటూ విసవిసా బయటికి వెళ్లిపోయిన మగమహారాజయిన భర్తను బాధగా చూస్తూ నిశ్చేష్టురాలయింది ఆ సగటు ఇల్లాలు.

**-ఎస్.కె.దుర్గ (క్యాతూరు)**